నేడు గోల్కొండ కోటలో పూజలు

గోల్కొండ: గోల్కొండ కోటలో ఈ నెల 1న (నేడు) శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి ఎనిమిదో బోనం పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యానిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు పేర్కొన్నారు. కోటపై గల ఆలయంలో వివరాలను బుధవారం వెల్లడించారు. అమ్మవారికి జరిగే మొత్తం తొమ్మిది పూజల్లో ఆరు పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారన్నారు. గోల్కొండ కోటలో వివిధ శాఖల ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇందులో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

పీఆర్సీ పెంపుపై తెలంగాణ సాంస్కృతిక కార్యవర్గం హర్షం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులకు పీఆర్సీ పెంచడంపై తెలంగాణ సాంస్కృతిక సారథి కార్యవర్గం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. బుధవారం రవీంద్రభారతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యశ్‌పాల్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సాంస్కృతిక కళాకారుల సేవలను గుర్తించి పీఆర్సీని పెంచడం ఆనందంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాపాలన ఆరు గ్యారంటీలపై సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని త్వరలో ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు శ్రీను, అంబటి వెంకన్న, మహిళా కార్యదర్శి జలజ, కార్యవర్గ సభ్యురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో మేటి చింతల్‌బస్తీ పీహెచ్‌సీ..!

- నిత్యం 100 నుంచి 120 మంది ఓపీ రోగులు రాక
- అవసరమున్న వారికి రక్త పరీక్షలు, మందులు అందజేత
- గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ, చిన్నారులకు టీకాలు


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

నాంపల్లి: నాంపల్లి క్లస్టర్ పరిధిలోని చింతలబస్తీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అత్యుత్తమ సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది. రోగులకు రక్త పరీక్షలు, మెరగైన వైద్య సేవలందించడంతో పాటు మందులు అందిస్తూ ముందు వరుసలో నిలుస్తున్నది. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్ డివిజన్ పరిధిలోని సైఫాబాద్ సైన్స్ కళాశాలకు సమీపంలో చింతలబస్తీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. ఇక్కడికి ప్రతిరోజు 100 నుంచి 120 మంది వరకు ఓపీ పేషంట్లు వస్తున్నారు. ఇందులో సాధారణ రోగాలతో పాటుగా యాంటీనెటాల్ కేర్ (ఏఎన్‌సీ), ప్రెగ్నెన్సీ కేర్, డయాగ్నోస్టిక్ సెంటర్ సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటుగా బీ12, విటమిన్ డీ, బీపీ, షుగర్ పరీక్షలను చేస్తున్నారు. అలాగే చిన్న పిల్లలకు ప్రతి బుధ, శనివారాల్లో ఉచితంగా టీకాలు (ఇమ్యునైజేషన్) ఇస్తున్నారు.

చిన్నారులకు టీకాలు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులకు టీకాలు అందజేస్తున్నారు. ప్రసవం తర్వాత చిన్నారి వైరస్ వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు అప్పుడే పుట్టిన శిశువు నుంచి పదేళ్ల వచ్చే వరకు క్రమానుసారంగా ఇవ్వాల్సిన టీకాలను వేస్తున్నారు.

దంపతులకు అవగాహన..

పెళ్లైనా దంపతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా తాత్కాలికంగా, శాశ్వత పద్ధతులను దంపతులకు తెలియజేస్తున్నారు. శాశ్వతంగా పిల్లలు వద్దనుకునే మహిళలకు ట్యూబెక్టమి, పురుషులకు వ్యాసెక్టమి పద్ధతులపై చికిత్స అందిస్తున్నారు. తాత్కాలిక పద్ధతుల్లో ఆడవారికి మాలా–ఎన్, చాయ, ఐయూసీడీ(కాపర్–టీ) పద్ధతుల్లో మాత్రలు (ట్యాబ్లెట్స్) ఇస్తున్నారు. ఇక మహిళలకు అంతర ఇంజెక్షన్‌ను ఇస్తారు. అలాగే మహిళకు ఐయూసీడీ–375 (కాపర్–టీ) పద్ధతిలో ఇంజెక్షన్ ఇస్తారు. ఇక పురుషులకు కండోమ్‌లను అందజేసేందుకు ఒక బాక్స్‌ను పనివేళల్లో అందుబాటులో ఉంచారు. కావాల్సిన వారు తీసుకెళ్తున్నారు. నిరాక్షరాస్యుల కంటే అక్షరాస్యులే ఎక్కువగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. కాపర్–టీ, ట్యాబ్లెట్స్, కండోమ్స్‌ను తీసుకుంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని సొంతం చేసుకుంటున్నారు.

టెలీ కన్సల్టేషన్ సదుపాయం..


చింతలబస్తీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఆన్‌లైన్ ద్వారా కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులను సంప్రదించే అవకాశం కల్పించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో వైద్యులను సంప్రదిస్తే తమ సమస్యకు పరిష్కారం సూచిస్తున్నారు. రోగికి అవసరమైన జాగ్రత్తలు, చికిత్స, మందులను తెలియజేస్తున్నారు. వీటికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం ఉండదు.

పీహెచ్‌సీలో నిలిచిన ప్రసవాలు..

కరోనాకు ముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగేవి. సీరియస్ కేసులను నిలోఫర్, నాంపల్లి ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేసేవారు. ఇబ్రహీంపట్నంలో జరిగిన ఘటనతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు కూడా నిలిచిపోయాయి. ఇప్పుడు కేవలం ప్రెగ్నెన్సీ కేర్ కేసులు మాత్రమే చూస్తున్నారు.

మహిళల్లో పెరిగిన చైతన్యం..

కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో పురుషులతో పాటుగా మహిళల్లోనూ చైతన్యం వచ్చింది. పీహెచ్‌సీకి పురుషుల కంటే మహిళలే అధికంగా కుటుంబ నియంత్రణ పద్ధతుల కోసం వస్తున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వైద్య సదుపాయాలు ఉన్నాయి. వీటిలో మాత్రలు, ఇంజెక్షన్లతో పాటుగా ట్యూబెక్టమీ చేయించుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ సంధ్య, వైద్యాధికారిణి, చింతలబస్తీ పీహెచ్‌సీ

పాలిటెక్నిక్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలి



సాంకేతిక విద్యాబోర్డు రాష్ట్ర కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

విజయనగర్‌కాలనీ: శిథిలావస్థకు చేరిన వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని ఏఐడీఎస్‌ఓ విద్యార్థులు, నాయకులు కోరారు. ఈ మేరకు మాసబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్‌లో బోర్డు రాష్ట్ర కార్యదర్శి ఎ.పుల్లయ్యకు బుధవారం వినతి పత్రం అందజేశారు. నూతన భవనం కోసం రూ.25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయాలని విన్నవించారు. అందించిన వారిలో ఏఐడీఎస్‌ఓ నాయకులు ఎస్.నాగరాజు, హరితేజ, వినోద్, అభిషేక్ తదితరులు ఉన్నారు.

టిప్పర్ యజమానిపై కేసు, జరిమానా

లంగర్‌హౌస్: బిల్లులు లేకుండా, అధిక లోడ్‌కు తోడు సమయం దాటాక వచ్చిన ఓ టిప్పర్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేయగా, పశ్చిమ మండల ఆర్టీఏ అధికారులు రూ. 42 వేల జరిమానా విధించారు. పోలీసులు, ఆర్టీఓ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దశరథ్ అనే వ్యక్తి సంగారెడ్డి నుంచి టిప్పర్‌లో అధిక లోడ్‌తో బుధవారం మధ్యాహ్నం ఇసుకను నగరంలోకి తరలిస్తున్నాడు. నానల్‌నగర్ ప్రాంతంలో టిప్పర్‌ను లంగర్‌హౌస్ పోలీసులు ఆపి ఇసుకకు సంబంధించిన వివరాలు, పత్రాలు అడిగారు. అతని వద్ద వే బ్రిడ్జి బిల్లు కూడా లభించలేదు. దీంతో బరువు చెక్ చేయగా అధిక లోడ్ కలిగి ఉంది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే ఆర్టీఓ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు జరిమానా విధించారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు వీడ్కోలు


అనురాధాదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గోల్కొండ: గోల్కొండ ప్రభుత్వోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాపరాల నాగఅనురాధాదేవి బుధవారం రిటైర్డు అయ్యారు. ఈ సందర్భంగా గోల్కొండ బడాబజార్‌లోని పాఠశాలలో ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.సుబ్బారావు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ అభివృద్ధికి కృషి


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. అబిడ్స్ ప్యాలస్ కాలనీలో కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖతో కలిసి రూ.45 లక్షలతో చేపట్టిన రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన కార్యాలయంలో సంప్రదిస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర బీజేపీ దళితమోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాశ్, అధికారులు వేణుగోపాల్, కల్యాణ్‌తో పాటు స్థానిక నాయకులు బజాజ్ కిశోర్, శైలేందర్, జ్ఞానేశ్వర్, వివేకానంద, నిర్మల్, దీపక్ సోలంకి, అజయ్, విజయ్‌సింగ్, తుల్జన్ పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. రూ.3,31,301 ఆదాయం సమకూరిందని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ అంజనా రెడ్డి తెలిపారు. మూడో హుండీకి సంబంధించిన తాళం అందుబాటులో లేకపోవడంతో లెక్కించలేదు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు మారుతీ యాదవ్, చంద్రకుమార్, కోశాధికారి సతీశ్ ముదిరాజ్, కన్వీనర్ అరవింద్ గౌడ్, మాజీ చైర్మన్లు విష్ణు గౌడ్, బంగ్లా రాజు యాదవ్ లక్ష్మీనారాయణ గౌడ్, మాణిక్ ప్రభు గౌడ్, వెంకటేశ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రైతుల పక్షపాతి


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు

అబిడ్స్: సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ మమతాగుప్తా, సంతోష్‌గుప్తా పేర్కొన్నారు. లక్షన్నర వరకు రైతులకు రుణ మాఫీ చేయడంతో బుధవారం ముఖ్యమంత్రిని వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనకు ఆకర్శితులై పార్టీలో చేరేందుకు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు.

నియామకం

గోల్కొండ: మెహిదీపట్నంలోని సరోజిని దేవి కంటి ఆసుపత్రి మెడికల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మోదీని నియమితులయ్యారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన డాక్టర్ వి.రాజలింగం బదిలీపై వెళ్లారు. దీంతో ఆసుపత్రిలో సీనియర్ వైద్యురాలుగా ఉన్న డాక్టర్ మోదీనికి బాధ్యతలు అప్పగించారు.

కరాటేలో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

చాంద్రాయణగుట్ట: టైగర్ కుంగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పాతబస్తీ జంగమ్మెట్‌కు చెందిన నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థి ప్రతిభ చూపాడు. జహనుమాలోని మోంట్ ఫోర్ట్ పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థి అక్షిత్ నాయక్ చాంపియన్‌షిప్ సాధించడంపై ప్రిన్సిపాల్ రెవరెండ్ ఈడ్వర్డ్, వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్, కో–ఆర్డినేటర్ ఫరీసా, నాయక్ బూడోఖాన్ అకాడమీ మాస్టర్ గణేశ్ నాయక్ అభినందించారు.

11న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజనుల చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతిని ఉత్సవాలను హైదరాబాద్ రవీంద్ర భారతీలో ఈ నెల 11న నిర్వహించనున్నట్లు జై గౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ బుధవారం తెలిపారు. హెచ్‌సీయూ వర్సిటీకి సర్దార్ సర్వాయి పాపన్న పేరుపెట్టాలని, ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు.

‘అక్రమ పదోన్నతులను రద్దు చేయాలి’


మాట్లాడుతున్న ఎస్టీటీ శ్రీనివాస్

సుల్తాన్‌బజార్: హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎస్జీటీ టీచర్లు కూతాడి వనిత, గుగులోతు ప్రసాద్‌రావుకు ప్రమోషన్లు కల్పించారని ఎస్జీటీ, దివ్యాంగుడు బూర శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రోస్టర్ నిబంధనలు ఉల్లంఘించి ఇద్దరికి అక్రమంగా ప్రమోషన్లు కల్పించారన్నారు. హైకోర్టు తనకు పదోన్నతి ఇవ్వాలని ఇచ్చిన ఉత్తర్వులను హైదరాబాద్ డీఈఓ రోహిణి తుంగలో తొక్కారని ఆరోపించారు. ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఒంటరి మహిళలకు చేయూత అభినందనీయం


చెక్కులు తీసుకున్న విద్యార్థులతో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం, తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఒంటరి మహిళల కుటుంబాలకు చేయూతనందించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. రవీంద్రభారతీలో ఆర్‌జే ఇన్‌స్పైషన్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ లోగోను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం 15 మంది ఒంటరి మహిళా కుటుంబాలకు రూ.5 వేల చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సంస్థ అధ్యక్షురాలు ఉమా కార్తీక్ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి


కార్యక్రమంలో పాల్గొన్న డీఎం ఎస్.రమేశ్

చాంద్రాయణగుట్ట: ఆర్టీసీ ఉద్యోగులంతా మరింత అంకితభావంతో పని చేసి సంస్థ ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఫలక్‌నుమా డిపో మేనేజర్ ఎస్.రమేశ్ అన్నారు. ఆర్టీసీ ఎండీ. సజ్జనార్ ఆదేశాలమేరకు ‘లక్షే లక్ష్యం’లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బుధవారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. 2024 ఉగాది నుంచి 2025 ఉగాది వరకు రోజుకు డిపోకు మరో రూ. లక్ష అదనంగా రాబట్టాలనే చాలెంజ్‌ను అధిగమించాలన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ కె.రాజయ్య, మెకానికల్ ఇంజినీర్ టి.దయాకర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జిగా మహ్మద్‌నజీబ్

గోల్కొండ: టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జిగా మహ్మద్‌నజీబ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్గనైజింగ్ చైర్మన్ మహ్మద్ నజీబ్ బుధవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్ ఫహాద్ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఏ ఒక్క కుటుంబం కూడా అపోహలు, అపార్థాలతో విడిపోవద్దనే తమ ఆర్గనైజేషన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.


మహ్మద్ అజీబ్‌ను సన్మానిస్తున్న మహ్మద్ ఫహాద్

సహకరించిన వారికి ధన్యవాదాలు

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల విజయంతానికి సహకరించిన వారికి ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ ఆలయానికి కమిటీ ప్రతినిధుల సహాయ సహకారాలతోనే బోనాల జాతర ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. అలాగే తమకు సహకరించిన భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యతో పాటు ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

ఏరియాసుపత్రి సూపరింటెండెంట్‌కు వీడ్కోలు


డాక్టర్ మహ్మద్ మజహరుల్లాను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ ఏరియాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. దీంతె గోల్కొండ ఏరియాసుపత్రిలో తోటి ఉద్యోగులు బుధవారం ఆయనకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి ఉద్యోగులు, నర్సింగ్ స్టాఫ్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రి అభివృద్ధిలో తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

మితిమీరిన వేగంతో దూసుకెళ్తూ...

బోల్తా పడ్డ కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారును వేగంగా నడుపుతూ ప్రహరీని ఢీకొట్టగా కారు బోల్తా పడి ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శంకర్‌పల్లికి చెందిన నక్కల సాకేత్‌రెడ్డి (20) ఇటీవలే బీసీఏ కోర్సు పూర్తి చేసి మూడు రోజుల్లో ఆస్ట్రేలియా వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలోనే తన చిన్ననాటి స్నేహితుడు కొంపల్లికి చెందిన సాయిసిద్ధార్థ్‌తో కలిసి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తన వెర్నా కారు (ఏపీ 09 సిక్యూ 3599)లో మాదాపూర్‌లోని సౌండ్స్ అండ్ స్పిరిట్స్ పబ్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి ఒంటి గంటకు మద్యం మత్తులో ఇద్దరూ బయటకు రాగా సాకేత్‌రెడ్డి కారు నడుపుతూ జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి చిరంజీవి బ్లడ్ బ్యాంక్ మీదుగా వెళ్తూ వెంకటగిరి వైపు మితిమీరిన వేగంతో దూసుకెళ్లి ప్రహరీని ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. దీంతో కారు నడుపుతున్న సాకేత్‌రెడ్డి, సాయిసిద్ధార్థ్‌కు గాయాలు కాగా వీరిని ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం సాకేత్‌రెడ్డిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. సాకేత్‌రెడ్డికి బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ నిర్వహించగా ఆల్కాహాల్ మోతాదు 130 బీఏసీగా నిర్ధారణ అయ్యింది. మద్యం మత్తులో వేగంగా కారును నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణాలపై దాడులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది బుధవారం దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిషేధానికి గురైన ప్లాస్టిక్ కవర్లలో వస్తువులను అందజేయడాన్ని గుర్తించి సీజ్ చేశారు. మరికొందరు వ్యాపారులకు రూ.500ల నుంచి రూ.1000ల వరకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రవి కుమార్ మాట్లాడుతూ... వ్యాపారస్తులు వినియోగదారునికి జూట్ బ్యాగ్‌లలో లేదా ప్రభుత్వం అనుమతించిన ప్లాస్టిక్ కవర్లలోనే వస్తువులను అందించాలన్నారు. నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను వాడితే జప్తు చేస్తామన్నారు. జప్తుతో పాటు అపరాధ రుసుము విధిస్తామన్నారు. ఈ విషయాన్ని గమనించి వ్యాపారస్తులు నిషేధిత ప్లాస్టిక్ బ్యాగ్‌లను వాడవద్దని సూచించారు.

అందరికీ కృతజ్ఞతలు


అధికారులు, నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్న ఉమ్మడి ఆలయాల ఊరేగింపు ప్రతినిధులు

- గాజుల అంజయ్య
- సత్కారం,మెమొంటో అందజేత


గాజుల అంజయ్యను సన్మానిస్తున్న రాకేశ్ తివారీ

చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లిలోని ఆర్‌ఆర్ ఫంక్షన్ ప్యాలెస్‌లో పాతబస్తీ బోనాల జాతర ఉత్సవాల ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రభుత్వాధికారులు, ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులందరికీ గాజుల అంజయ్య ధన్యవాదాలు తెలిపారు. మీర్‌చౌక్, ఛత్రినాక ఏసీపీలు వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్‌రావు, జలమండలి సీజీఎం వినోద్ భార్గవ్, జీఎం కృష్ణా నాయక్, మేనేజర్లు, టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ డీఈ లింగయ్య, ఏడీఈ, ఏఈలను గాజుల అంజయ్య సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఇక ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్లు రాకేశ్ తివారీ, పాటిల్ సదానంద్ యాదవ్, జనగామ మధుసూదన్ గౌడ్‌తో పాటు ఆలయాల కమిటీ ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, బుల్లెట్ శ్రీధర్, రాయికోటి బాబురాజా, ప్యారసాని వెంకటేశ్, శ్రీధర్ యాదవ్, గాజుల రాహుల్ (గబ్బర్), కాట రమేశ్ తదితరులు గాజుల అంజయ్యను ఘనంగా సత్కరించగా.. ఆలయాల కమిటీ ప్రతినిధులను ఆయన సత్కరించి మెముంటో అందజేశారు.


కోట మైసమ్మ కమిటీ ప్రతినిధులు ..


హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ ప్రతినిధులు


మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ..

సినారె సాహితీ పురస్కార ప్రదానం


ఓలేటీ పార్వతీశంకు పురస్కారం ప్రదానం చేస్తున్న జస్టిస్ రాధారాణి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిని ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జయంతి వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశంకు సినారె సాహితీ పురస్కారాన్ని అందజేశారు. అంతకు ముందు సినారే గీతాలాపన ఆకట్టుకుంది. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి, ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, అక్కినేని నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, రవాణశాఖ పూర్వ అదనపు కమిషనర్ సీఎల్‌ఎన్ గాంధీ, రచయిత్రి శైలజ మిత్ర, సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.